


“పెళ్ళికొడుకు ఎట్లాగున్నాడూ?” అని నళిని కుతూహలంగా ప్రశ్నించింది జ్యోతిని.

నళిని ఆరోజే బెంగుళూరునుంచి వచ్చింది. పరీక్షలవగానే అన్నయ్య దగ్గరకు బెంగుళూరు వెడుతూ పెళ్ళినాటికి తప్పకుండా వస్తానని ఇందిరతో చెప్పింది నళిని. కానీ ఆ సమయానికి ఫ్లూరావటం వలన ఎంత బాధపడినా ఇందిర పెళ్ళికి మాత్రం రాలేకపోయింది. జ్వరం తగ్గగానే వెంటనే బయలుదేరి వచ్చేసింది ఇందిర భర్తతో వెళ్ళేలోగా ఒకసారి చూడవచ్చని.

ఇందిరకోసం తను కొన్న బహుమతులు తీసుకుని ఇందిర ఇంటికి బయలుదేరింది. తోవలో జ్యోతి ఇంటి దగ్గర ఆగింది.

ఆ ముగ్గురూ స్నేహితురాళ్లు. ఆ ఏడాదే బి. ఎ పాసయ్యారు. జ్యోతికి ఏడాది క్రిందటే వాళ్ళ బావతో పెళ్ళి అయింది. ఇప్పుడు ఇందిర పెళ్లి అయింది. ఇందిర కోసం తనుకొన్న గంధం చెక్కతో చేసిన నగలపెట్టె, వెండి కుంకుమ భరిణి జ్యోతికి చూపించి-

“పెళ్ళికొడుకు ఎట్లాగున్నాడూ?” అనడిగింది నళిని.

“చూడటానికి బాగానే వున్నాడు. ఇందుకు సరిపోతాడు. చూస్తావుకా. మెడ్రాసులో లెక్చరరుగా ఉంటున్నాడు. సామాన్యంగా ఉన్నారు అత్తవారి వైపు వాళ్ళు. ఇందుకి రెండు పట్టు చీరలు పెట్టారు. మూడు పేటల గొలుసు పెట్టారు. అంతే. ఔను మరి వీళ్లకూడా నాలుగు వేలే కదూ కట్నం ఇస్త!” అంది జ్యోతి.

“నీకు మీ బావ కనక కట్నం లేకుండా చేసుకున్నాడు” అంది నళిని నవ్వుతూ.

జ్యోతి భర్త హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు.

“కట్నం లేదన్న పేరే కానీ, పదివేలు పదిలింది మా నాన్నకి వాళ్ళకి ఇచ్చిన లాంఛనాలకి. పెళ్ళి ఖర్చు వేరే ఐదువేలు!” అంది జ్యోతి.

“లెక్చరరంటే మూడు వందలో మహా అయితే నాలుగు వందలో ఉంటుంది జీతం. ఏం చూసి చేసుకుంది ఇందిర అతడ్ని” అంది నళిని కొంచెం పెదవులు చిట్లిస్తూ అసంతృప్తిగా.

“దానికేంగానీ అసలు సంగతివిను. పెళ్లిలో వాళ్ళ బంధువులు చెప్పుకుంటున్నారు. అతడు వాళ్ళ మామయ్య కూతుర్ని ప్రేమించాడుట. వాళ్ళు బాగా డబ్బువున్నవాళ్లట, పైగా జాతకాలు కూడా కలవలేదుట. అందుకే పై సంబంధం చూశారుట. ఇందిరని పెళ్ళి చేసుకున్నాడు.” అంది జ్యోతి కుతూహలంగా నళిని వైపు చూస్తూ.

“నిజంగానా! ఇంత అవమానం, బాధ ఇందిర ఎట్లాగ భరిస్తోందో! అంతకంటె చావటం నయం. నేనైతే ఈ అవమానం భరించే కంటె నాలుగు మాత్రలు మింగి దీర్ఘనిద్రపోయేదాన్ని.” అంది చీదరించుకుంటూ నళిని. అక్కడనుంచి ఇందిర దగ్గరకు వెళ్లింది. తను తెచ్చిన బహుమతి అందించింది.

“ఇట్లాగవిన్నాను. అతడు వాళ్ళ మామయ్య కూతుర్ని ప్రేమించాడుట. నిన్ను పెళ్లి చేసుకున్నాడు. నీకు బాధగా లేదూ” అంది నళిని ఇందిరతో.

“బాధగానే ఉంది” అంది ఇందిర.

“మరి అట్లాగ ఉదాసీనంగా ఊరుకుంటావేం?” అంది నళిని.

ఇందిర విచారంగా నవ్వింది.

“మరి ఏం చెయ్యమంటావు!” అంది.

“కాపరానికి వెళ్ళకుండా ఏడిపించాలి. నేనైతే క్షమాపణకోరి కాళ్ళ బేరానికి వస్తేగానీ ఊరుకోను. నిన్నుచూస్తే జాలివేస్తోంది.” అని నళిని ఇంటికి వచ్చేసింది, ఇందిర భర్తని చూశాక.

మనుగుడుపులు మూడు రోజులూ అత్తవారింట్లో గడిపి భర్తతో పుట్టింటికి వచ్చింది ఇందిర. మరునాడే అతడు ఉద్యోగం చేస్తున్న ఊరికి వెళ్లిపోవాలి. నళిని వచ్చివెళ్ళాక.... గదిలో ఒకరి కొకరు ఎదురుగా కూర్చుని ఉన్నారు ఇందిర, ఆమె భర్త శ్రీధర్.

“ఏమంటోంది మీ ఫ్రెండు.” అనడిగాడు అతడు.

ఇందిర మాట్లాడలేదు.

“ఈ పిల్లకికూడా తెలుసా నాకథ” అతడు మళ్ళీ అడిగాడు.

ఇందిర ఏ భావమూ వ్యక్తం కాకుండా నవ్వింది.

“అందరి నోట్లోనూ విన్నావు. నా నోటితో చెప్పాల్సిందీ ఉంది. అది నిజమేనని. మరి నువ్వు ఏమనుకుంటున్నావో నాకు తెలియటం లేదు,” అన్నాడు ఇందిర వైపే చూస్తూ.

ఇందిర ప్రయత్నించి అంది——

“ప్రేమించటం తప్పుకాదు. అది మనిషిలో ప్రేమించే గుణం ఉండటానికి నిదర్శనం. మీరేం దుర్మార్గం చెయ్యలేదు. ఎవరికీ ద్రోహం

చెయ్యలేదు. మీరు ప్రేమించగలరని అనుకున్నాను."

శ్రీధర్ ఇందిరకి దగ్గిరగా జరిగి "కానీ నీకు బాధగాలేదూ" అన్నాడు.

"ఉంది. కానీ పరిస్థితులకీ పరిసరాలకి అతీతంగా చూడగలిగితే ప్రతి మనిషి ఆత్మకానీ, హృదయంకానీ ఒకటే అని, అది విలువైందని నమ్ముతాను నేను. ఎప్పటికైనా దానిని ఆరాధించ గలుగుతానని, తృప్తిపొందగలనని నమ్మకం ఉంది నాకు."

"నిన్ను నేను ప్రేమించలేకపోతే."

"అట్లాగని బాధించకండి నన్ను. పైన చెప్పినదే నా సమాధానం. ప్రేమించగల మనసు ప్రేమించకుండా ఉండలేదు," నవ్వింది ఇందిర దిండు కానుకుని. ఇందిర చేతిని తన గుండెల మీదికి తీసుకుని కన్నులు మూసుకున్నాడు శ్రీధర్.

* *

ఇందిర భర్తతో ఊరికి వెడుతోంది. నళిని, జ్యోతి స్టేషన్‌కి వచ్చారు. ఇన్నాళ్లూ ముగ్గురూ కలిసి ఉన్నారు. ఇంక ఎవరి త్రోవ వారిది. ఎవరి బ్రతుకు వాళ్లది కాబోలు! కళ్లలో నీళ్ళు తిరుగుతుంటే—

"అట్లాగ వెళ్ళిపోతున్నావు అందరినీ విడిచిపెట్టి నీకు బాధగా లేదూ!" అంది నళిని.

"బాధగా ఉన్నా వెళ్ళటం అనేది తప్పదు కదూ" అంది ఇందిర.

"నువ్వు కదలికలు లేని బండరాయివి" అంది నళిని.

"బాధ ఎందుకు! ఇంకా హాయిగా ఉండటానికి వెడుతుంటే," అంది జ్యోతి నవ్వుతూ ఇందిర కళ్లలోకి చూస్తూ.

"నువ్వొకదానివి. ఎప్పుడు బావదగ్గరికి పరిగెడదామా అని చూస్తున్నావు. అతడు చాలా సంస్కారం ఉన్నవాడు కనుక నిన్ను బలవంతంగా చదివిస్తున్నాడు.......ఇంక గడువయింది కదూ! పోదువుగానిలే" అంది నళిని.

"నువ్వు మాత్రం ఇట్లాగే ఒక్కదానివి ఊరేగుతావేమిటి! మీ నాన్న ఏదో సంబంధం నిశ్చయిస్తారు," అంది జ్యోతి.

నళిని మొహంలోకి సిగ్గు వచ్చింది. ఇందిర భుజం మీద, జ్యోతి భుజం మీద చెయ్యివేసి దగ్గరగా ఇద్దరినీలాగి రహస్యంగా అంది.

"నిశ్చయమైపోయింది. ఏదో ట్రైనింగ్‌కి స్టేట్స్‌కి వెళ్లాడుట. వచ్చాక మూడునెలల తరవాత పెళ్ళి" అంది.

"చాలా సంతోషంగా ఉంది" అంది ఇందిర.

"నే ననుకుంటూనే ఉన్నాలే ఈ సంబంధం కుదురుతుందని" అంది జ్యోతి. నళిని ఇందిర చేతిని తన చేతిలోకి తీసుకుని అంది:

"రాణీగారికి ఇంకనేను గుర్తుండను కానీ, పెళ్ళికి మాత్రం రావాలి. ఎక్కడ ఎట్లాగ ఉన్నా సరే. నేను నీ పెళ్ళికి రాలేకపోయాను. నువ్వు నా పెళ్ళికి రాకపోతే...."

"వస్తాను. నేను నిన్ను మరిచిపోను కానీ, కాబోయే పెళ్ళిని గురించి కలలలో పడి నువ్వే నన్ను మరిచిపోతావు నళినీ" అంది ఇందిర ఆపేక్షగా.

నళిని కళ్ళు తళతళలాడాయి.

రైలులో ఇందిర వెళ్ళిపోతుంటే చేతులు ఊపుతూ మౌనంగా నిలబడిపోయారు జ్యోతి, నళిని.

* *

నళిని పెళ్ళి వైభవంగా జరిగింది. ఇందిర, జ్యోతి కూడా వచ్చారు పెళ్ళికి. నళినికి నాలుగు పట్టు చీరలు పెట్టారు ఒక్కొక్కటి రెండు మూడు వందల ఖరీదులో. మూడువేలు చేసే నగలు పెట్టారు మగ పెళ్ళివారు. పెళ్ళికొడుకుకి బొంబేలో నెలకి ఐదు వేలు వచ్చే ఉద్యోగం. పన్నెండు వేలు కట్నం ఇచ్చారు. నళినీ కళకళలాడుతోంది అలంకరణ,సంతోషం కలుపుకుని. కానుకలు చదివించటం అయ్యాక పెళ్ళికూతురు లోపలికి వచ్చింది. గదిలో విశ్రాంతికోసం పడుకుంది. నళినీ పక్కనే కూర్చున్నారు ఇందిరా, జ్యోతి.

ఇందిర తను తెచ్చిన బహుమతి రెండు పుస్తకాలు ఇచ్చింది. రవీంద్రుడి రచనలు. జ్యోతి నళినీ చేతిని తన ఒడిలోకి తీసుకుని తన వ్రేలి నున్న ఉంగరం తీసి నళిని వ్రేలికి తొడిగి "ఇది నా కానుక నళినీ" అంది.

నళినీ తన చేతిని కళ్ల ఎదురుగా తీసుకుని ఉంగరం చూసింది.

"ఏమిటిది జ్యోతీ...నువ్వు పాసయినప్పుడు మీ నాన్న ఇచ్చారు కదూ దీన్ని" అంది ఆశ్చర్యంగా చూస్తూ.


జ్యోతి నవ్వింది.

"ఔను. ఇది నాకు ఎంతో ప్రియమైనది. అందుకే నీ కిస్తున్నాను. ఉంచుకోవాలి నువ్వు" అంది.

జ్యోతి ఇంటికి వెడుతుంటే రిక్షా దాకా వెళ్ళింది ఇందిర. అక్కడ ఆగి "అసలు నళిని పెళ్ళికి రాగలిగేదాన్ని కాదు ఇందూ. అమ్మకి ఒంట్లో బాగుండక పోతే చూడటానికి వచ్చి ఇక్కడే ఉన్నాను కనక పెళ్ళి చూడగలిగాను. పెళ్ళి అంటే బావ పంపించి ఉండేవారని నాకు నమ్మకంలేదు. ఆ ఉంగరం ఇస్తే నళిని ఆశ్చర్యపడుతుందని నాకు తెలుసు. కానీ యేం చెయ్యను ఇందూ! పెళ్లి అయ్యాక అమ్మా వాళ్ళని అడగలేను. బావని అడిగి లాభంలేదు. డబ్బు విషయం వచ్చేసరికి అట్లాగయిపోతారు. అట్లాగని డబ్బులేక కాదు. నెలకి ఐదువందలు వస్తాయి. పొలాల మీద కూడా కాస్త ఆదాయం ఉంది. నన్ను చదువుకని పుట్టింటిలో ఉంచిన ఏడాదిలో రెండు వేలు నిలువ చేశారు. దానితో ఫర్నిచరు కొన్నారు. తన సరదాలకి కూడా... చాలా ఖర్చుచేస్తారు. కాని నాకు అవసరమైతే పాతిక రూపాయలు కూడా.....యాచించినా దొరకవు. మీ అమ్మ దగ్గర ఉంటే నీ ఖర్చులు వాళ్ళే భరించాలి అంటారు. అందరూ అభిమానం లేనివాళ్ళే వుండరుగా. మధ్యలో నా అవస్థ ఇది." అంది జ్యోతి బలవంతంగా కన్నీళ్ళు ఆపుకుంటూ.

"ఇంకా కొత్తకదూ. కొన్నాళ్ళుపోతే మీ బావే నిన్ను అడుగుతారు తన ఖర్చుకి" అంది ఇందిర. జ్యోతి నవ్వుతూ రిక్షా ఎక్కింది.

ఇందిర లోపలికి వచ్చి నళిని దగ్గర కూర్చుంది.నళిని ఇందిరని చూస్తూ. "జ్యోతి ఉంగరం ఎందు కిచ్చింది! వాళ్ళ నాన్నగారు ఇచ్చినది..........బహుమతిగా నా కెందుకు ఇవ్వాలి! ఇంకేమీ కొనలేక ఇచ్చిందా!




ఇవ్వకపోతేనేం! నా పెళ్ళికి తను వచ్చింది. అంతే చాలు. కానీ నాకు అర్ధంకావటం లేదు. బాధగా ఉంది. జ్యోతి దగ్గర డబ్బు ఉండదా! అవసరానికి కూడా వాళ్ళ బావ డబ్బు ఇవ్వరా! ఆడవాళ్ళకి మాత్రం అవసరాలుండవా? అటువంటి పరిస్థితిలో ఎట్లాగ బ్రతుకుతోంది జ్యోతి! అతడు ఇవ్వక పోతే ఊరుకోవటమేనా! తిని చాకిరీ చేస్తూ పశువులాగ నోరు మూసుకుని పడి ఉంటుందా? భార్య అంటే అదేనా? వాళ్ళు మంచిగా ఉండకపోతే ఆడది సాధించి తీరాలి" అంది ఆవేశంగా.

"నీకేం, కబుర్లు చెప్తావు!" అంది ఇందిర నవ్వుతూ.

"ఉట్టి కబుర్లుకాదు ఇందూ. నాకు బాధగా ఉంటుంది ఇటువంటివి చూస్తుంటే. అసలు మీ వాళ్లు మాత్రం ఏం మునిగి పోయిందని నాలుగు సంబంధాలైనా వెతక్కుండా, తెలిసిన వాళ్ళనీ, కట్నం పేచీ పెట్టలేదని ఈ పెళ్ళి చేసేశారు నీకు. కట్నం లేకపోయినా ఖర్చు తప్పిందా? ఇంకో మూడువేలు పారేస్తే ఏ ఇంజనీరో, ఆఫీసరోవచ్చి ఉండేవాడు. దర్జాగా ఉండే దానివి," అంది నళిని.

"ఇంకో మూడు వేలు!" అని నవ్వింది ఇందిర.

"దర్జాగా ఉండవలసిన వాళ్ళమే. వాళ్ళ నాన్నగారు బాగా సంపాదించారు. ఆస్థికూడా ఉందిట. కానీ ఏవో అప్పులు ఉండి అవి తీర్చటం, చెల్లెళ్ళకి పెళ్ళి చెయ్యటం, తమ్ముళ్ళకి చదువులు చెప్పించటంలో ఏమీ మిగలలేదు...." అంది.

"ఘనకార్యంచేశారు" అంది నళినికోపంగా.

* • *

ఇప్పుడు ఇందిరకి ఇద్దరు పిల్లలు, ఒక కూతురు, ఒక కొడుకు. బాగానే ఉంది. ఇందిర భర్తకి వచ్చే జీతంతో ఎట్లాగో సర్దుకోవచ్చు అనుకుంది నళిని. ఆ రోజు ఇందిర దగ్గర నుంచి వచ్చిన ఉత్తరం నళినిని ఆశ్చర్యంలో పడేసింది. ఇందిరకి ఏడో నెలట మళ్ళీ. ఇది వరకొకసారి "నువ్వు కూడా ఉద్యోగం చెయ్యకూడదా.........అప్పుడు ఆర్థికంగా ఇబ్బంది ఉండదు" అని రాస్తే "ఆయనకి ఇష్టంలేదు" అని జవాబిచ్చింది ఇందిర.

ఇందిర గురించిన ఆలోచనలతో బాధపడుతుంటే భర్త రింగ్‌చేశాడు. ఆఫీసులో పని ఉందిట. రావటం ఆలస్యం కావచ్చు అని.

"సుషమ కూడా ఉంటుందా?" కసిగా ఉన్న గొంతుతో అడిగింది.

"ఆ. ఉంటుంది." అతడి కంఠంలో నవ్వు ధ్వనిస్తోంది.

చటుక్కున రిసీవర్ పెట్టేసింది నళిని.

"రాత్రికి వంట చెయ్యను. మెహతా వాళ్ళింటికి వెళ్లి పదింటికి వస్తాను. ఏమైనా చేసుకోనీ" అనుకుంది.

ఇందిర ఉత్తరం గుర్తువచ్చింది. ఆవేశం కలిగింది. గబగబా ఉత్తరం రాసింది.

"ఇందూ....ఇట్లాగ రాస్తున్నందుకు క్షమించు కానీ నీకసలు బుద్ధిలేదు. నువ్వు....ఉద్యోగం చెయ్యవు. గడవని పరిస్థితిలో ఉండి ఇంకా పిల్లల్ని కంటున్నావా?

ఇందూ....ఊహించుకుంటే నీ పరిస్థితికి ప్రాణం దహించుకు పోతోంది. నీ స్థితిలో నేనుంటే నిజంగా.

నన్నుచూడు....నీ కవగానే పెళ్లి అయింది. ఇంకా పిల్లలులేరు. అప్పుడే వద్దు నాకు. అతను ఎంత స్వతంత్రంగా ఉంటాడో తెలుసా!

నేనూ తక్కువగా లేను. పిల్లల్ని కంటె ఇట్లాగ ఉండకలనా? వాళ్ళకోసమైనా మగవాడికి తలవంచాల్సి వస్తుంది. నీ బాధ్యతల్ని ఎట్లాగ నిర్వహిస్తున్నావో! ఇంక ముందేనా జాగ్రత్తగా ఉండు. నువ్వే జాగ్రత్త పడాలి. ఊరుకుంటే మగవాడికి ఎందుకు పడుతుంది.

నీ నళిని"

పని అవుతుంటే మెహతా ఇంటినుంచి తిరిగి వచ్చింది నళిని. వచ్చేటప్పటికి రాప్ తన గదిలో సూట్‌కేసు సర్దుకుంటున్నాడు. నళినిని చూసి నవ్వి. "రాణిగారు ఇప్పుడు వచ్చారు. పోనీలే నీకు శ్రమ తప్పింది. సూట్ కేసు సర్దేసుకున్నాను. ఢిల్లీకి వెళ్ళాలి. మా డైరెక్టరు నన్ను వెళ్ళమన్నాడు. నిన్న నీకు చెప్పటం మరిచి పోయా. సాయంత్రం నువ్వెందుకో కోపంగా ఉన్నట్లున్నావు. రిసీవర్ పెట్టేశావు." అన్నాడు.

ముంగురులు దిద్దుతూ నుదుటికి పట్టిన చెమటను తుడుచుకుంది నళిని.

"భోజనం చేశారా?" అనడిగింది.

"ఆ. సాయంత్రమే వచ్చాను ఇంటికి. తాళం ఆహ్వానించింది. ఐనా డూప్లికేటు ఉందికా. స్నానంచేసి క్వాలిటీకి వెళ్ళాను. అక్కడ శ్రీమతి కౌశల్ కనిపించింది. నీకు తెలుసుకా. భర్తకి విడాకులిచ్చింది ఆవిడ. కానీ మంచి మాటకారి. సరే అక్కడతిని ఇంటికి వచ్చాను. సూట్‌కేసు సర్దటం అయింది. మరి నీ భోజనం!" అన్నాడు....జాలిగా గొంతు పెట్టి.

"నాకు ఆకలిలేదు. మెహతా ఇంట్లో దహిబడా, నిమ్కి ఫ్రూట్ సాలడ్ తిన్నా" అంది నళిని నీరసంగా.

"సుషమ కూడా వస్తోందా?" మళ్ళీ అడిగింది నళిని.

"ఆ. తనులేకపోతే ఎట్లాగ! పర్సనల్ ఎసిస్టెంటు కదా!" అన్నాడు.

'అసలు ఈ ఆడవాళ్ళని ఆఫీసుల్లో వేసుకోకపోతే బాగుండును. కొన్ని కాపరాలు నిలబడతాయి కూలి పోకుండా. ఛ ఇంత పాత కాలపు దానిలాగ ఆలోచిస్తున్నానేమిటి? మన బుద్ధి మంచిది కావాలి కానీ ఎదుట ఏ ఆడది ఉంటే మాత్రం ఏం చేస్తుంది! మనసుగట్టి ఉంటే....' అనుకుంది నళిని తనలో తను. పొద్దున్న భర్తని ఎయిర్ పోర్టులో దింపి, ప్లేన్ బయలుదేరగానే ఇంటికి తిరిగి వచ్చింది కారు గారేజ్‌లో పెట్టింది. షాపింగ్‌కి కానీ, ఫ్రెండ్సు ఇంటికి కానీ వెళ్ళ బుద్ధికాలేదు. పడకగదిలోకి వెళ్ళి డన్‌లప్ పరుపుమీద వాలిపోయింది.

'నాకు డబ్బు అవసరంలేదు కానీ నేను కూడా ఉద్యోగం చేస్తాను.' అనుకుంది.

'అతడు కూడా నన్నుచూసి అసూయ పడాలి' అనుకుంది.

* * *

కొన్నాళ్ళ తరవాత రావ్ పనిమీద మెద్రాస్ వెడుతుంటే నళినీ కూడా అతడితో బయలు దేరింది....ఇందిరని చూడవచ్చని. ఇందిర కూడా రమ్మని మరీ మరీ రాసింది. ఇందిర కోసం, ఇందిర పిల్లలకోసం చాలా వస్తువులు కొంది నళిని. తను కొత్తగా కొనుక్కున్న నగలు, చీరలు పెట్టిలో సర్దుకుంది. రావ్‌కోసం స్టేషన్‌కి ఆఫీసు వాళ్ళ కారు వచ్చింది. నళినిని ఇందిరా వాళ్ళంట్లో దింపి, రావ్ తన పని చూసుకోటానికి వెళ్ళిపోయాడు.

ఇందిరా వాళ్ళది మైలాపూర్‌లో చిన్న ఇల్లు. దానికే వంద ఇస్తున్నారుట అదీ పాత ఇల్లు కనుక. నళినీ తన అసంతృప్తిని ప్రకటించింది.

"ఎట్లాగ కాపరం చేస్తున్నావో నాకర్థం కావటంలేదు. బాంక్‌లో నాఎకౌంటు పదివేలున్నాయి. నా చీరలకి వస్తువులకి రెండు బీరువాలున్నాయి. స్కూటరు తను వాడుకుని కారు నాకే వదిలేస్తారు రావ్. ఇంట్లో ఫ్రిజ్‌తోసహా పర్నిచరంతా ఉంది. స్వతంత్రం ఉంది. ఏం చేసినా రావ్ నన్ను ఏమీ అడగరు, అనరు. అయినా అసంతృప్తే. అట్లాంటిది ఎట్లాగ భరిస్తున్నావో-ఈ...."

"....ఈ నరకం" అని వాక్యం పూర్తిచేసి నవ్వింది ఇందిర.

"నిజమే. పెరిగిపోయిన ధరలతో మారిన పద్ధతులతో ముగ్గురు పిల్లలతో మాకు వచ్చే డబ్బుతో గడపటం సమస్యే....పిల్లల చదువులూ, ఇన్సూరెన్సు, పండగలూ అంటూ ఎన్నో ఖర్చులు. నేనూ ఇరవై రూపాయల కంటె ఖరీదైన చీరకట్టుకోను. సిల్కు చీరలు కట్టకపోతే బ్రతక లేననిపించదు నాకు. నాకూ ఉద్యోగం చెయ్యాలనిపిస్తుంది కానీ అతనికి ఇష్టంలేదు. ఇల్లూ ఉద్యోగం, పిల్లలూ చూసుకోలేవు నిన్ను అంతకష్ట పెట్టడం నా కిష్టంలేదు. ఉద్యోగం, సదుపాయాలన్నీ ఉన్న ఆడవాళ్ళు మాత్రమే చెయ్యాలి అంటారు ఆయన. అదీ నిజమే. ఏదో మాఅవసరాలు గడిచిపోతున్నాయి సర్దుకు పోతున్నాము. ఇంతకంటె ఏం చెయ్యాలో ఏం చెయ్యగలనో నాకు తెలీదు. పిల్లల్ని ఆరోగ్యంగా పెంచగలిగి, వాళ్ళని బాగా చదివించగలిగితే చాలను కుంటాను. కానీ.... హాయిగా డైనింగ్ టేబుల్‌మీద భోజనం.... డన్‌లపిల్లోమీద పడక అలవాటు నీకు. ఈచిన్న ఇల్లు, నేలమీద పక్క, కూర పులుసు భోజనంతో నిన్ను బాధపెడుతున్నానేమో! నిన్ను చూసి చాలా రోజులయింది. చూడాలనే ఆశతో రమ్మని అంతగా రాశాను" అంది ఇందిర.

"ఛ! దానికేమిటి! రెండు రోజులు గడుపుకోటానికి నాకేం బాధ. నేను దానికి బాధపడటం లేదు. నువ్వు ఎక్కడ ఉన్నా వస్తాను నేను. నువ్వు ఇట్లాగ బ్రతుకుతున్నావనే నాబాధ అంతాను" అంది నళిని.

* * *

రాత్రి బెడ్‌రూమ్‌లో పక్కమీద పడుకుని ఈవ్స్ వీక్లీ చూస్తోంది నళిని. న్యూస్ పేపరు చూస్తున్నాడు రావు.

"మంచి నీళ్లు" అన్నాడు.

"ఆ బాటిల్ ఇప్పుడే పైన పెట్టాను, తీసుకోండి" అంది నళిని.

రావ్ డైనింగ్ టేబుల్ దగ్గరకువెళ్లి నీళ్లు త్రాగివచ్చాడు.

"నాకు ఆశ్చర్యం వేస్తుంది. ఇంజనీరింగ్ చదివింది, ఉద్యోగం చేస్తోంది. మా బాసుకే సలహాలిచ్చే తెలివి తేటలున్నా సుష్మలో స్త్రీత్వం తొణికిస లాడుతుంటుంది. ఆ మాట నవ్వు, కదలికలు ఎప్పుడూ సౌకుమార్యాన్ని కోల్పోవు. ఆ అమ్మాయి పక్కనుంటే చాలనిపిస్తుంది. నిజంగా చేసుకునేవాడు అదృష్టవంతుడు!" అన్నాడు. నళిని నవ్వింది.

"మీరట్లాగ అనటంలో ఆశ్చర్యం లేదు. కానీ ఆ చేసుకునేవాడు, అట్లాగ అనగలిగితే నిజంగా ఆవిడ అదృష్టవంతురాలే. ఆ స్త్రీత్వం భార్యలో ఉంటే నిర్లక్ష్యం చేస్తారు మీ మొగవాళ్లు. అది భార్యలో లేకపోతే బ్రతుకు తెరువు వెతుక్కుంటూ పతివ్రతా వేషాలు వేసే వాళ్ళ వెంట పడతారు. అంతే కదూ...."

"ఎవరైనా తనని నిరసించే మనిషి వెంట పడలేరు...."

"నేను మిమ్మల్ని నిరసించినట్లు భావిస్తున్నారన్నమాట! ఇండిపెండెంటుగా ఉండే ఆడవాళ్ళంటే ఆకర్షణ మీకు. మళ్ళీ భార్య అట్లాగుంటే సహించలేరు!"

"ఇండిపెండెంట్‌గా ఉంటే భర్తని మీరు సహించగలరా? సాధించి ప్రాణాలు తీస్తారు. లేదా తీసుకుంటారు," అన్నాడు రావు.

"ఇండిపెండెంట్ అంటే నీతి దూరమని మీ ఉద్దేశం! అవినీతిలో స్వేచ్ఛే కదూ మీరు కోరే స్వతంత్రం! సుష్మని మెచ్చుకునే బదులు నేను మీకు నచ్చలేదని చెప్పకూడదూ."

"దానివలన ఏం లాభం! నువ్వు మారతావా?"

"నేను మారాలా! ఎందుకు! మీలో ఈ కోరిక ఉందని తెలియటం ఆశ్చర్యం కలిగి



స్తోంది. నా కోసం మీరు మారగలరా? నేను ఒకరిని అనవసరంగా బాధించను. నన్ను ఒకరు బాధిస్తే నేను సహించను. సుష్మ అంటే మీ కిష్టం ఉంటే పెళ్లి చేసుకోండి. నా అభ్యంతరం ఉండదు. నేను మారితే మీ గుణం మారుతుందని నేను నమ్మలేను. నాకు ఈ మాత్రం సుఖానైనా ఇచ్చే స్వతంత్రాన్ని నేను వదలుకోలేను. మీరు అనే స్త్రీత్వాన్ని నేను నటించలేను" అంది నళిని.

"నేను సుషమని పెళ్లి చేసుకోను. నువ్వు నమ్మకపోయినా, మారకపోయినా సరే" నళినిని దగ్గరగా తీసుకుంటూ అన్నాడు రావు.

"పెళ్లి చేసుకోరు కానీ..........మనసులో సుషమ....ఎదుట నేను!" అంది నళిని. అతడిని చూస్తూ. రావ్ చాలా ఆకర్షణీయంగా ఉంటాడు. నళిని కళ్లలోకి చూస్తూ చిన్నగా నవ్వాడు. గుండె బాధని మాధుర్యాన్ని కలబోసుకుని స్పందిస్తుంటే బలంగా ఉన్న అతడి చేతుల్ని వదలించుకుని దిండులో మొహం దాచుకుంది నళిని. పురుషుడి ముందు ఏడిచే అబలల్ని అసహ్యించుకునే నళిని కళ్లలో నీళ్లునిండాయి.

* * *

మిషన్‌మీద ప్రాకు కుడుతోంది ఇందిర. పోస్టుమాను ఉత్తరం పడేశాడు. ఉత్తరం తీసుకుంది ఇందిర. అది నళిని దగ్గరనుంచి వచ్చింది.

"ఇందూ!

ఎట్లాగున్నావు! నేను బాగానే ఉన్నాను. ఇప్పుడు నేనుకూడా ఉద్యోగం చేస్తున్నాను. నేను ఓడిపోదలుచుకోలేదు. నేను అతడికేమీ తీసిపోను. మగవాడి ఆధిక్యతకి తలవంచే ఆడవాళ్ళంటే నీకు తెలుసుకదూ....నాకు వొళ్ళుమంట.

అతడికి సుష్మలాగే నాకూ సిన్హా అని స్నేహితుడున్నాడు.

స్నేహమేలే! భయపడకు. భయమెందుకు? నాకేం భయంలేదు. మగవాళ్ళు మాత్రం మనుషులు కారా! వాళ్ళకీ మనలాగే భయాలు, పరిధులూ, ఆలోచనలూ ఉంటాయి. అసలు ఆడది తెగిస్తే కానీ మగవాడు ముందుకి అడుగు వెయ్యలేడు. భయపడాల్సింది ఏమీలేదు. నా ఇష్టం వచ్చినట్లు ఉంటాను. ఇష్టం వచ్చిన వాళ్ళతో స్నేహం చేస్తాను. అతడికి లేని నియమాలు, ఆరాటం నాకు మాత్రం ఎందుకు! చిత్రమేమిటంటే రావ్ ఏమీ ఉడుక్కోడు. నన్ను చూసి అసూయపడదు. పైగా ఈవాదాన్ని సమర్థిస్తాడు.

జీవితాలు పందెపు గుర్రాల లాంటివి.

తృప్తి అనేది ఉండదు. ఉండకూడదు.

ఇంకా నాకు పిల్లలు కావాలి అనిపించటం లేదు. ఎప్పుడేనా అనిపించినా....స్వతంత్రం వదులుకోటానికి సిద్ధంగాలేను. ఈ మధ్య రావ్ హైదరాబాద్ వెడుతుంటే నేనుకూడా వెళ్లాను. జ్యోతిని చూడటానికి. ఏం చూశానో నీకు రాస్తున్నాను.

జ్యోతి సంసారం ఒక విచిత్రం. వాళ్ళ బావ శర్మ బాగానే సంపాదిస్తాడు. అంటే ఫరవా లేదు. పెద్ద ధనికులేమీ కాదు.

వాళ్ళ ఇల్లు చాలా బాగుంటుంది. వెళ్ళగానే ముచ్చట వేసింది ఇల్లుచూసి. అతడు కూడా చాలా సరదాగా కన్పించాడు. రెండు రోజులుంటే తెలిపింది అతడి సరదా క్రింద జ్యోతి దుఃఖం గూడు కట్టుకుని ఉందని. అతడికి మా వారిలాగ ఆడ స్నేహితులులేరు కానీ జ్యోతికి ఏ మాత్రం స్వతంత్రంలేదు. సుఖం లేదు. ఇంటి కర్చులకి కొంత డబ్బు ఇస్తాడు. మిగతాదంతా తన ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెడతాడు. తన గుడ్డలకి, వస్తువులకి, క్లబ్బులో స్నేహితులతో తిని తాగటానికి. డబ్బున్న వాడిలాగ సొసైటీలో తిరగాలని, లైఫ్ ఎన్‌జాయ్ చెయ్యాలని ఆశకాబోలు. జ్యోతి ఊరుకోదు. వాళ్ళిద్దరికీ పోట్లాటలు అవుతూనే ఉంటాయి. కానీ ఫలితం శూన్యంట. జ్యోతికి బయట షోగ్గా కనిపించటానికి నాలుగు చీరలున్నాయి. పిల్లలూ అంతంత మాత్రమే. జ్యోతికి పెళ్ళినాడు పెట్టిన అరిగిపోయిన నగలు తప్ప మళ్ళీ ఒక్కటికూడా కొనలేదు. భార్యకి ఏ సరదా తీరదు. ఏ అలంకరణా అక్కరలేదు, తనకి మాత్రం అన్నీ కావాలి....ఎంత సిగ్గులేని మగవాడో అనిపించింది. అట్లాగ దెబ్బలాడుకుంటూ, దుఃఖపడుతూ ఉండటం కంటె విడిగా ఉండకూడదా అని నేనంటే జ్యోతి ఏమందో తెలుసా?

"అతడికి నేనంటే ఇష్టం. ఆ తిరగటం, డబ్బు ఖర్చుపెట్టడం అదంతా ఒక పిచ్చి అంతే. నగలు, చీరలు లేకపోతేనేం! అతడికి నేను కావాలి. ఇంకొక ఆడదాని ధ్యాసలేదు...."

అంది ఆఖరి మాటతో రావ్‌ని దెప్పుతున్నట్లుగా.

ఉన్న నాలుగు రోజులూ నన్ను బాగానే చూశారు. ఊరంతా తిప్పారు.

అదంతా నా మెప్పుకోసమే కానీ ఆ జ్యోతి సంతోషం కోసం కాదు.

అప్పటిదాకా సరదాగా ఉన్నవాడు జ్యోతి నాకు పాతిక రూపాయలుపెట్టి చీరకొని ఇచ్చిందని దెబ్బలాడాడు ఒక రాత్రంతా. జ్యోతి కళ్ళు ఉబ్బేలాగ ఏడిచిందంటే నువ్వు నమ్మవేమో!

అటువంటి మొగుడితో కాపరం చేసే కంటె....

నువ్వు ఎట్లాగ ఉన్నావు! సన్నగా చిక్కిపోయి, పిల్లలతో సతమతమయ్యే నువ్వుగుర్తు వస్తే జాలితో నిండి పోతుంది నా మనసు. బాగా టానిక్స్, మందులూ తీసుకో. పిల్లలకోసమైనా నువ్వు ఆరోగ్యంగా ఉండాలి కదా.... ఉత్తరం వ్రాయి.

నీ....నళిని"

* * *

పిల్లలు నిద్రపోయారు. వంటిల్లు సర్ది వీధి వరండా మెట్లమీద కూర్చుంది ఇందిర. అంత ఇరుకుగా ఉన్న ఇళ్ళలోకి కూడా గాలి చల్లగా వీస్తోంది. ఆకాశంలో నక్షత్రాలు మినుకు మినుకు మంటున్నాయి. తను చదువుతున్న పుస్తకం మూసి వరండాలోకి వచ్చి ఇందిర పక్కన కూర్చున్నాడు శ్రీధర్.

"ఇందూ" అన్నాడు.

"ఆ" అంది ఇందిర.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్...." అన్నాడు.

చిన్నగా నవ్వి "జ్యోతిని గురించి, నళినిని గురించి ఆలోచిస్తున్నాను" అంది ఇందిర.

"వాళ్ళిద్దరూ గొప్పవాళ్ళే. నువ్వే బీదదానివి" అన్నాడు శ్రీధర్.

"నేనేం బీదదాన్ని కాదు. నాకేం లోటు! తిండి గుడ్డ ఉంది. నా అభిప్రాయాలకి విలువ ఇచ్చే మీరున్నారు. మనకి ఉన్న దాంట్లో సర్దుకుని తృప్తిపడ గలుగుతున్నాము. జ్యోతిని తలుచుకుంటే భయం వేస్తుంది. తన భర్త ఏ మాత్రం సహకరించడు. ఎట్లాగ భరిస్తుందో అనిపిస్తుంది. ఇంక నళిని! తనకి హోదా, డబ్బూ, స్వతంత్రం కావాలి. అతడు అందంగా ఉంటాడు. మిగతా విలువలు. ఆత్మగౌరవం, అభిమానం, అనురాగం ఏమీ అక్కరలేదు. బీదరికం అంత అసహ్యంచుకోవలసిందేమీ కాదు. నైతిక విలువలు కోల్పోవటం కంటె బీదరికమే నయం. నళినిని తలుచుకుంటే అంత కంటె చావటం మంచిదనిపిస్తుంది" అంది ఇందిర.

